
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం : 19 : మార్చి : 2024



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 802 టన్నుల సరుకు వచ్చింది.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.10



న్యూస్‌రీల్

క్వింటా చింతపండు రూ.22 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.22 వేలు ధర పలికింది. మార్కెట్‌కు సోమవారం 25,250 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.10 వేల మేర పలికిందన్నారు. ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.8 వేలు, కనిష్టంగా రూ.4,200 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

'పది' పరీక్షలు ప్రారంభం

- జిల్లాలోని 115 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 22,862 మంది విద్యార్థులు హాజరు



ఎనుములపల్లి పాఠశాల కేంద్రంలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి: పదో తరగతి పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 115 కేంద్రాలు ఏర్పాటు చేయగా, తొలిరోజు జరిగిన తెలుగు/సంస్కృతం పరీక్షకు 22,862 మంది విద్యార్థులు హాజరయ్యారు. 954 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు.


పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

పుట్టపర్తి పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాల, వాసవీ ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, సిబ్బంది ఉన్నారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు విద్యార్థులు తీసుకెళ్లకుండా ముమ్మరంగా తనిఖీలు చేశారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేయించారు.

చోరీకి వచ్చి.. విగతజీవిగా మారి..



స్తంభంపై శ్రీరామ్ నాయుడు మృతదేహం

బత్తలపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైరు చోరీ చేయడానికి వచ్చిన ఓ యువకుడు విద్యుత్‌ఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం బత్తలపల్లిలో చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు తెలిపిన వివరాల మేరకు.. యల్లనూరు మండలం తిమ్మంపల్లికి చెందిన శ్రీరామ్ నాయుడు (30) భార్య పుష్ప, ఇద్దరు కుమారులతో ప్రస్తుతం పుట్టపర్తి సమీపంలోని ఎనుములపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిగా తిరిగే శ్రీరామ్ నాయుడు చోరీలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బత్తలపల్లికి చెందిన తొలచూరి పెద్ద వెంకటేష్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైరు చోరీ చేసేందుకు స్తంభంపైకి ఎక్కాడు. అయితే విద్యుత్ వైరు కట్ చేసేందుకు ఉపయోగించే ఆక్సా బ్లేడు 11కేవీ విద్యుత్ లైనుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై విద్యుత్ స్తంభంపైనే మృత్యువాత పడ్డాడు. సోమవారం సాయంత్రం తొలచూరి పెద్ద వెంకటేష్ తన పొలానికి వెళ్లగా... విద్యుత్ స్తంభంపై విగతజీవిగా వేలాడుతున్న వ్యక్తిని గుర్తించి పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య సిబ్బందితో కలిసి మృతదేహాన్ని కిందకు దించారు. మృతుడు శ్రీరామ్ నాయుడుగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ రథం.. ఉపాధి మార్గం

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోన్న జగన్ సర్కార్.. సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూరుస్తోంది. వివిధ శాఖల ద్వారా సబ్సిడీపై వాహనాలు అందిస్తూ యువతకు ఉపాధి కల్పిస్తోంది. తద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది.

- అర్హులకు పథకాల ద్వారా లబ్ధి.. యువతకు ఉపాధి
- జీవనోపాధులు పెంపొందిస్తున్న వైఎస్ జగన్ సర్కార్
- వివిధ శాఖల ద్వారా అర్హులకు వాహనాలు అందజేత

పుట్టపర్తి అర్బన్: ప్రజల జీవనోపాధులు పెంపొందించడానికి జగన్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోంది. ఎన్నికల హామీల అమల్లో భాగంగా వివిధ పథకాల లబ్ధిని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. అలాగే నాన్‌డీబీటీ కింద పలు వర్గాలకు ఆర్థిక చేయూత నిస్తోంది. ఇందులో భాగంగా అర్హులైన రైతులకు ట్రాక్టర్లు, పలు రకాల యంత్ర పరికరాలు అందజేసింది. అలాగే ఆటో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న మహిళలకు ఆటోలు, మత్స్యకార కార్మికులకు ద్విచక్ర వాహనాలు(టీవీఎస్ మోపెడ్), చౌక దుకాణాల నుంచి రేషన్ ఇంటింటికీ తరలించడానికి ఎండీయు వాహనాలను అందజేసి ఆదుకుంది. వీటి ద్వారా వేలాది మంది కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చింది.

రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు

'వైఎస్సార్ వాహన మిత్ర'లో భాగంగా ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ 40 శాతం సబ్సిడీతో కోరుకున్న కంపెనీ ట్రాక్టర్‌ను, వలన మణి, ఇతర యంత్ర పరికరాలను అందజేస్తోంది. ఈ పథకంలో భాగంగా రెండు విడతల్లో జిల్లాలోని 371 సీహెచ్‌సీ గ్రూపులకు 255 ట్రాక్టర్లు, 676 యంత్ర పరికరాలను అందజేసింది. అలాగే రూ.9.71 కోట్లు సబ్సిడీ మొత్తాన్ని సైతం రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఒక్కో ట్రాక్టర్ విలువ రూ.15 లక్షలు ఉండగా, ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించింది. సబ్సిడీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది.

మహిళలకు ఆటోలు

'మహిళా ఆటో శక్తి' పథకంలో భాగంగా అర్హులైన ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని మహిళలకు 40 శాతం సబ్సిడీతో ఆటోలను అందించింది. ఈ పథకంలో భాగంగా తొలి విడతలో జిల్లాలోని ఆరుగురికి లబ్ధి కలిగింది. ఒక్కో ఆటో మొత్తం విలువ రూ.3,35,190 కాగా, 10 శాతం లబ్ధిదారుల వాటా చెల్లించాలి. తక్కిన మొత్తాన్ని ఈఎంఐల ద్వారా చెల్లించవచ్చు. వీటికి ప్రభుత్వం సున్నా వడ్డీ వర్తింపజేసింది.

వివిధ పథకాల్లో అందిన వాహనాలు	
ట్రాక్టర్లు	255
ఆటోలు	06
ద్విచక్ర వాహనాలు	16
ఎండీయూ వాహనాలు	349
యంత్ర పరికరాలు	676

మత్స్యకార కార్మికులకు ద్విచక్ర వాహనాలు

మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్రా యూనిట్లు నెలకొల్పిన ప్రభుత్వం వందలాది మందికి జీవనోపాధులు పెంపొందించింది. 90 శాతం సబ్సిడీతో ఫిష్ ఆంధ్రా యూనిట్లు మంజూరు చేసి ఆదుకుంది. ఇక పేద మత్స్యకార కార్మికులు ఊరూరా తిరిగి చేపలను అమ్ముకోవడానికి రూ.75 వేలు విలువ చేసే టీవీఎస్ మోపెడ్ వాహనాలను 40 శాతం సబ్సిడీతో అందజేసింది. జిల్లాలో అర్హులైన 16 మంది మత్స్యకార కార్మికులకు వీటిని పంపిణీ చేసింది.

ఎండీయూ వాహనాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ రేషన్ సరుకులు కోసం జిల్లాలో అర్హులైన 349 మంది యువకులకు వాహనాలను సబ్సిడీపై అందజేసింది. ఒక్కో వాహనం విలువ రూ.5.85 లక్షలు కాగా, డిపాజిట్‌గా రూ.60 వేలు చెల్లించారు. మిగతా మొత్తాన్ని నెలవారీ కంతుల రూపంలో చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో వాహనానికి నెలకు రూ.21 వేలు అందిస్తోంది. ఇందులో రూ.3 వేలు బ్యాంకు కంతుకు మినహాయించుకుని రూ.18 వేలు అందిస్తోంది. ఇలా ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు చెప్తున్నారు.



ప్రభుత్వ సబ్సిడీతో రైతులకు అందజేసిన ట్రాక్టర్లు

జీవనోపాధికి మార్గం చూపారు



నేను వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో సబ్సిడీపై ట్రాక్టర్ కొనుగోలు చేశా. ప్రస్తుతం నా వ్యవసాయ పనులు వినియోగించుకుంటూనే ఇతరులకు బాడుగకు పంపుతున్నా. ఖర్చులు పోనూ నెలకు రూ.50 వేలు సంపాదిస్తున్నా. నా జీవనోపాధికి మార్గం చూపిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా.

– శ్రీరాములు, ఓబుళరెడ్డిపల్లి, తలుపుల మండలం

ఆదాయం పెరిగింది



నేను గ్రామాల్లో తిరిగి చేపలు అమ్ముతుంటా. ప్రభుత్వం నాకు సబ్సిడీపై ద్విచక్ర వాహనం మంజూరు చేసింది. దీనివల్ల నాకు ఎంతో మేలు జరిగింది. గతంలో రోజూ రూ.500 సంపాదించేవాడిని. ప్రస్తుతం వాహనంలో ఎక్కువ గ్రామాలు తిరగడం వల్ల విక్రయాలు పెరిగాయి. తద్వారా నా ఆదాయం కూడా రోజుకు రూ.3 వేల వరకు పెరిగింది.

– నాగేంద్ర, కొత్తచెరువు

నెలకు రూ.20 వేలు సంపాదిస్తున్నా



మహిళా ఆటో శక్తి పథకం ద్వారా నేను రూ.33,629 చెల్లించి సబ్సిడీపై ఆటో కొనుగోలు చేశా. నెలకు రూ.20 వేలు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నెలవారీ కంతులు కూడా పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నా. సరదాగా నేర్చుకున్న డ్రైవింగ్ నాకు ఉపాధి కల్పించింది. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువే.

– సంతోషీబాయి, నల్లమాడ

కదిరికి బ్రహ్మోత్సవ శోభ



యాగశాలలో కొలువు దీరిన శ్రీవారు (ఫైల్)

- ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ
- సకల దేవతలకు ఆహ్వానం పలకనున్న అర్చకులు

కదిరి: పక్షం రోజుల పాటు నిర్వహించే ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి 2024 వార్షిక బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ జరగనుంది. పాల్గుణ కృష్ణ దశమి మంగళవారం (19న) సూర్యాస్తమయం తర్వాత అర్చకులు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. వసంత వల్లభునిగా పూజలందుకునే ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలతో కదిరి నూతన శోభను సంతరించుకుంది.

స్వామి ఆశీస్సుల కోసం..

బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యత ఉంది. నవ ధాన్యాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందటమే ఈ అంకురార్పణ ఘట్టం ముఖ్య ఉద్దేశం. ఈ ఘట్టంలో అర్చక పండిత బృందం అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ తదితర అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

నవధాన్యాలతో మొలక

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక (కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రున్ని ప్రార్థిస్తూ వేద పండితులు అందులో నీరు పోసి నవ ధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం అర్చకులు.. సోమరాజ, వరుణ మంత్రాలతో పాటు విష్ణుసూక్తం పఠిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చకులు రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేందుకు సహకరిస్తారు. ఈ మొత్తం తంతు వేద మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహిస్తారు.

సమష్టి కృషితో విజయ ఢంకా మోగిస్తాం

- హిందూపురంలో గెలుపే లక్ష్యం
- సంక్షేమ పథకాలే మా అస్త్రాలు
- మహిళలకు పట్టం కట్టిన జగనన్న
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, చిత్రంలో హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి జె.శాంతమ్మ, పార్టీ నాయకులు

హిందూపురం: సమష్టి కృషితో జిల్లాలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో విజయ ఢంకా మోగిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బుక్కపట్నం నవీన్ నిశ్చల్ అన్నారు. సోమవారం ఆయన హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎస్ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి జె.శాంతమ్మ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, పార్టీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి తదితరులతో కలిసి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనపై ఎంతో నమ్మకంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పార్టీ జిల్లా బాధ్యతలు అప్పగించారని, ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి జగనన్నకు కానుక ఇస్తానన్నారు. జన సంక్షేమమే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ అజెండా అని, జనానికి మంచి చేసేందుకే జగన్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. దోచుకోవడం తప్ప సేవ చేయడం తెలియని కొందరు... అధికారం కోసం గుంపుకట్టారనీ, పొత్తుల పేరుతో దిగజారి రాజకీయాలు చేస్తున్నారు. విజ్ఞత గల జనం జగన్‌ను గుండెల్లో పెట్టుకుని చూస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్ని జెండాలు ఏకమైనా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేవన్నారు.

పురం అభివృద్ధి మా బాధ్యత

దివంగత నేత రాజశేఖరరెడ్డి, ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ఇక్కడి నుంచి రెండు దశాబ్దాలుగా అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహిస్తున్న టీడీపీ నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. హిందూపురం అభివృద్ధి తమ బాధ్యత అని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల నుంచి ఇద్దరు బీసీ మహిళలు టీఎస్ దీపిక, జె.శాంతమ్మలకు అవకాశం ఇచ్చిందన్నారు. అందువల్లే బడుగు, బలహీన వర్గాలంతా వారికి మద్దతు పలుకుతున్నారన్నారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ ఎందుకని బీసీలకు టిక్కెట్లు ఇవ్వలేకపోయిందో చెప్పాలన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ఈ సారి హిందూపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎస్ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి జె.శాంతమ్మ మాట్లాడుతూ.. హిందూపురం సమగ్రాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. చుట్టపుచూపుగా హిందూపురం వచ్చే బాలకృష్ణ పదేళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండే ఎండ



- మార్చిలోనే నిప్పులు కురిపిస్తున్న భానుడు
- రోజురోజుకూ పెరిగిపోతున్న ఎండల తీవ్రత
- గరిష్ట ఉష్ణోగ్రత 40.4 డిగ్రీలుగా నమోదు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

కదిరి: మార్చిలోనే సూర్యుడు మండిపోతున్నాడు. ఉదయం 10 తర్వాత భగభగ మంటూ నిప్పులు కురిపిస్తుండగా జనం అల్లాడిపోతున్నారు. రోజు రోజుకూ గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా మే నెల ఉష్ణోగ్రతలు ఇంకెంతకు చేరుకుంటాయోనని జనం భయపడిపోతున్నారు.

అప్పుడే 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

జిల్లాలోని హిందూపురం, కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం 39.4 నుండి 40.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో మధ్యాహ్న సమయంలో రోడ్డుపైకి రావడానికే జనం భయపడుతున్నారు. చాలా మంది ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఇంట్లోనే గడుపుతున్నారు. దీంతో జిల్లాలోని వివిధ పట్టణాల్లోని రహదారులు మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా కన్పిస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో బయటకు వస్తున్న వారు గొడుగులు, టోపీలు, కళ్లద్దాలు ధరిస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులు కిటకిట

ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు జనం శీతల పానీయాలను సేవించేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో కూల్ డ్రింక్ షాపులు జనంతో కిటకిట లాడుతున్నాయి. అలాగే కొబ్బరి బోండాలకు గిరాకీ పెరిగింది. ఇక హైస్పీడ్ ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగింది.

వారం రోజుల ఉష్ణోగ్రతల వివరాలు ఇలా..		
తేదీ	గరిష్టం	కనిష్టం
12	39.1	21.4
13	39.7	20.8
14	40.3	22.7
15	40.8	22.3
16	41.7	23.2
17	40.3	21.6
18	40.4	21.2

అత్యవసరమైతేనే బయటకు రండి



అనవసరంగా ఎండల్లో తిరిగి ఎవ్వరూ కష్టాలు తెచ్చుకోవద్దు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఇళ్లకే పరిమితమైతే మంచిది. వీరికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువ. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా వెంట గొడుగు తీసుకెళ్లడమో లేదంటే కళ్లకు అద్దాలు, తలకు టోపీ ఉండేలా చూసుకోవాలి. ఎండాకాలంలో మంచినీరు బాగా తాగాలి. వడదెబ్బకు గురైతే సొంత వైద్యం పక్కన బెట్టి వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లడం క్షేమదాయకం.

–డా.మదన్ కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, కదిరి

క్లుప్తంగా

రైలు పట్టాలపై మృతదేహం

గుంతకల్లు: స్థానిక జీఆర్పీ పరిధిలోని గుంతకల్లు – బళ్లారి రైలు మార్గంలో బంటనహాల్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై ఓ గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సున్న వ్యక్తి... 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, ఆరంజ్ కలర్ చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా 94406 27670, 95501 11589లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు రామచంద్రప్ప

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రొప్పం గ్రామ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. సోమవారం ఉదయం 11 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. పావగడలోని వేణుగోపాలస్వామి ఆలయం వీధికి చెందిన రామచంద్రప్ప (50) తన టీవీఎస్ ద్విచక్ర వాహనంపై రొద్దం గ్రామానికి వెళుతుండగా రొప్పం శివారులో జేసీబీ వేగంతో వచ్చి ఢీ కొంది. ఘటనలో తలకు తీవ్ర గాయాలైన రామచంద్రప్ప స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు.

పని ప్రాంతంలో వెల్డింగ్ కార్మికుడి మృతి

ముదిగుబ్బ: పని ప్రాంతంలో పైనుంచి కిందపడి వెల్డింగ్ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు... అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన జిలాన్ (50) వెల్డింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం వద్ద గోదాములో కొన్ని రోజులుగా వెల్డింగ్ పనుల్లో ఆయన నిమగ్నమై ఉన్నాడు. ఆదివారం రాత్రి పనుల్లో నిమగ్నమైన ఆయన ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

జెడ్పీ ఉద్యోగులకు డిప్యుటేషన్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఆరుగురు ఉద్యోగులను డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం వీరిని బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జెడ్పీ కార్యాలయ ఎస్ఏ లెక్కల శ్రీనివాసులును అమరాపురం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఏఓ షేక్ షబ్బీర్‌నియాజ్‌ను శెట్టూరు ఎంపీడీఓ కార్యాలయానికి, పుట్టపర్తిలోని పీఐయూ ఈఈ విభాగంలో ఎస్ఏగా పనిచేస్తున్న ఎస్.కేశవను జెడ్పీ కార్యాలయానికి, అనంతపురంలోని పీఆర్ క్యూసీలో జేఏగా పనిచేస్తున్న తేజకుమార్‌రెడ్డిని రొద్దం ఎంపీడీఓ కార్యాలయానికి, ధర్మవరం పీఆర్ఐ సబ్‌డివిజన్ పరిధిలో జేఏగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరెడ్డిని అనంతపురంలోని డీఎల్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

ప్రాణం పోస్తారనుకుంటే.. తీశారు!

- వంశీ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- క్రిటికల్ కేసును రెఫర్ చేయకుండా నిర్లక్ష్యం
- వైద్య పరీక్షల పేరుతో చికిత్స జాప్యం
- ఆస్పత్రిని సీజ్ చేయాలంటూ నిరసన




మృతుడు యుగంధర్, ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, జేపీసీ నాయకులు

అనంతపురం: వైద్యోనారాయణో హరిః అన్నారు పెద్దలు. వైద్యుడిని సాక్షాత్తు దేవుడితో పోల్చుకుని గౌరవిస్తారు ప్రజలు. అయితే డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నెల 15న అనంతపురంలోని శ్రీనివాస న్యూరో అండ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి ఇంటర్ విద్యార్థిని అంకిత మృతి చెందిన విషయం మరువకనే మరో ఘటన వెలుగు చూసింది. ప్రాణాలు పోస్తారనుకుని ఆస్పత్రికి తీసుకువస్తే ఉన్న ప్రాణాలు తీసేశారంటూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు.

ఏం జరిగింది?

శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన యుగంధర్ (27) రక్త విరేచనాలతో బాధపడుతుంటే ఆదివారం సాయంత్రం అనంతపురంలోని అరవింద్‌నగర్‌లో ఉన్న వంశీ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. అప్పటికే రోగి పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి తరుణంలో క్రిటికల్ కేసును వెంటనే సర్వజనాస్పత్రికి రెఫర్ చేయాల్సి ఉన్నా... ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వివిధ రకాల వైద్య పరీక్షల పేరుతో కాలయాపన చేశారు. దీంతో పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు యుగంధర్ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భిణి. ఘటనతో బాధిత కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహంతో రగిలిపోయారు. ఆస్పత్రిలోని అద్దాలు ధ్వంసం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యమే ఉసురు తీసింది

విషమ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న యుగంధర్‌కు సకాలంలో వైద్యం అందించకుండా వైద్య పరీక్షల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా యుగంధర్ మృతికి కారణమయ్యారంటూ బాధిత కుటుంబసభ్యులు వంశీ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ప్రతినిధులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వైద్యం తెలియని వారు సిండికేట్‌గా ఏర్పడి ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే వంశీ ఆస్పత్రి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ భైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పి నిరసనలు విరమింపజేయించారు.

డీఎంహెచ్‌ఓ ఘెరావ్

యుగంధర్ మృతి సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి వెంటనే స్పందించారు. తక్షణమే వంశీ ఆస్పత్రికి ఆమె చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ప్రజా సంఘాల నాయకులు, మృతుడి కుటుంబసభ్యులు ఆమెను ఘెరావ్ చేశారు. తమ కుటుంబసభ్యుడిని పొట్టన పెట్టుకున్న ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డబ్బు కోసం కక్కుర్తిపడి ప్రాణాలు తీసేశారంటూ బోరున విలపించారు.

షోకాజ్ నోటీసులు జారీ

అనంతపురం మెడికల్: వంశీ ఆస్పత్రి నిర్వాహకులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి షోకాజ్ నోటీసు జారీ చేశారు. యుగంధర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె నేరుగా ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. రోగి మృతికి కారణాలపై ఆరా తీశారు. ప్రమాదకర కేసులను హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపకుండా జాప్యం చేయడం, ఇతర కారణాలు చూపుతూ ఆస్పత్రి నిర్వాహకులకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఘటనపై లోతైన విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో గంగాధర్ తదితరులున్నారు.


బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు జరగాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


అధికారులతో సమావేశమైన జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి)ను అమలు జరపాలని స్థానిక అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని నూతన భవనంలో డీఎస్పీ, నియోజకవర్గ నోడల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఏసీటీ, వీఎస్‌టీ, వీవీటీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేసి, పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీతో శాంతిభద్రతల సమస్యపై ఆరా తీశారు. సమావేశంలో డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్‌తో పాటు హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకూ ప్రవర్తనా నియమావళి

- అధికార పార్టీలతో పాటు వర్తింపు
- స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

అనంతపురం అర్బన్: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించిన మరుక్షణం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ప్రజాప్రతినిధులు అధికారికంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదు. ఎన్నికల సమయంలో తమ అధికారాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. ఈ విషయాన్ని ప్రవర్తనా నియమావళిలో ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రస్తావించింది. నియమావళిని పాటించకపోతే ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘించినట్లే అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకూ ప్రవర్తనా నియమావళి వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇకపై ప్రజాప్రతినిధులకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధికారులు, ఉద్యోగులు ప్రోటోకాల్ పాటించరాదు. ప్రజాప్రతినిధుల వద్ద పీఏలుగా, పీఆర్ఓలుగా, ఫొటోగ్రాఫర్లుగా ఉన్న ప్రభుత్వ నియమిత ఉద్యోగులు తిరిగి వారి సొంత శాఖల్లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరు కాకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

అధికార పార్టీకి నియమావళి

- కేంద్రంలో పాటు రాష్ట్రంలోని అధికార పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారానికి అధికార హోదాని దుర్వినియోగం చేయరాదు.
- ప్రజాప్రతినిధులు తమ పర్యటనలను, ఎన్నికల పనిని కలిపి నిర్వహించకుండా జాగ్రత్తపడాలి. ఎన్నికల పనికి పాలనా యంత్రాగాన్ని, సిబ్బందిని ఉపయోగించకూడదు.
- అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వం సమకూర్చిన విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వాహనాల సౌలభ్యాలతో పాటు పాలనా యంత్రాగాన్ని, సిబ్బందిని వినియోగించరాదు.
- ఎన్నికల సభలను నిర్వహించేందుకు ఉపయోగించే మైదానాలు వంటి బహిరంగ ప్రదేశాలను, హెలీప్యాడ్‌లను తమ కోసం వినియోగించుకోరాదు. ప్రదేశాలను, సౌకర్యాలను అధికారంలో ఉన్న పార్టీ ఏ షరతులపై వాటిని ఉపయోగిస్తారో... అవే షరతులపై ఇతర పార్టీలు, అభ్యర్థులు ఉపయోగించుకోవడానికి అనుమతించాలి.
- ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విశ్రాంతి గృహాలు, బంగ్లాలు, ఇతర ప్రభుత్వ వసతి సౌకర్యాలను వినియోగించరాదు.
- వార్తాపత్రికల్లోనూ, ఇతర మీడియాల్లోనూ ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇవ్వరాదు. ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ మాస్ మీడియాని ఉపయోగించరాదు.
- ఎన్నికల నిర్వహణ తేదీలను ప్రకటించినప్పటి నుంచి మంత్రులు, ఇతర అధికారులు తమ కోటా నిధుల నుంచి ఎలాంటి గ్రాంట్లు, చెల్లింపులు చేయరాదు. ఏ రూపంలోను, వాగ్దానాల గానూ ఎలాంటి ఆర్థిక గ్రాంట్లను ప్రకటించరాదు.
- ఏ ప్రాజెక్టులు, పథకాలకు శంకుస్థాపనలు చేయరాదు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వంటి విషయాల్లో వాగ్దానాలు చేయరాదు.
- ప్రభుత్వంలోనూ, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ ఎలాంటి అడహక్ నియామకాలు చేయరాదు.

అధికారులు చేపట్టాల్సినవి

- ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలి. అధికార పార్టీకి అనుకూలత చేకూర్చే ప్రతి చర్యా కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. అలాంటి వాటిని అధికారులు నియంత్రించాలి.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చిత్రపటాలను తొలగించాలి.
- రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేయాలి.
- ప్రభుత్వ పథకాల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలి.
- ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ గోడల మీద ఉన్న రాతలను తుడిపేయాలి.
- ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న స్లోగన్‌లను తొలగించాలి.
- ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు, పోస్టర్లను ముద్రించి పంపిణీ చేయకుండా చూడాలి. అలా చేసే వారిపై ఎంసీసీ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలి.

నిందితులకు రిమాండ్

రొళ్ల: పొలంలో అక్రమంగా వేసుకున్న గుడిసెను తొలగించడానికి వెళ్లిన రైతుపై వేటకొడవలితో దాడి చేసిన ఘటనలో ఆక్రమణదారులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వివరాలు... రొళ్ల మండలం జీబీ హళ్లి చెందిన నాగేగౌడ, రత్నగిరి చెందిన బ్రహ్మదేవ్‌కు చెందిన సర్వే నంబర్ 494లో 1.61 ఎకరాల పొలాన్ని రెండేళ్ల క్రితం అగళి మండలం వీరనపల్లికి చెందిన రైతు శివన్న కొనుగోలు చేశాడు. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన బసవరాజు, చంద్రకళ దంపతులు గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గుడిసెను తొలగించాలని పలుమార్లు శివన్న కోరినా వారు ససేమిరా అన్నారు. ఆ భూమి తమదేనంటూ బీష్మించారు. దీంతో ఈ నెల 16న జేసీబీ సాయంతో గుడిసెను తొలగించేందుకు వెళ్లిన రైతు శివన్నపై బసవరాజు, చంద్రకళ విరుచుకుపడ్డారు. శివన్న రెండు చేతులు వెనక్కి కట్టి నేలపై పడేశారు. తర్వాత శివన్న ఛాతీ, నుదుటిపై బసవరాజు పిడిగుద్దులు గుద్దగా.. వేటకొడవలితో మోకాళ్లపై చంద్రకళ విచక్షణ రహితంగా దాడి చేసింది. అనంతరం ఇద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన శివన్న తుమకూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఉదయం జీబీహళ్లిలో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హంద్రీ–నీవాకు నీటి పంపింగ్ నిలుపుదల

అనంతపురం సెంట్రల్: హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకానికి సోమవారం నీటి పంపింగ్‌ను అధికారులు నిలిపి వేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం తగ్గిపోవడంతో పంపింగ్ నిలుపుదల చేసినట్లు ఎస్ఈ దేశానాయక్ తెలిపారు. మంగళవారం వరకూ జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు వస్తాయని, ఈ క్రమంలో రిజర్వాయర్ దిగువకు మరో వారం రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. కాగా, గతేడాది ఆగస్టు 18న హంద్రీ–నీవాకు కృష్ణాజలాల రాక మొదలైంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జలాశయంలో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో నీటి పంపింగ్‌ను నిలిపి వేశారు. కాగా, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలోనూ ఏకంగా ఈ నెల 18వ తేదీ వరకూ నీటిని పంపింగ్ చేయడం గమనార్హం. ఈ ఏడాది మొత్తం 31.084 టీఎంసీలను హంద్రీనీవాకు ఎత్తిపోశారు. ఇందులో ప్రవాహ నష్టాలు పోనూ కర్నూలు జిల్లాకు 4.233 టీఎంసీలు, అనంతపురం జిల్లాకు 17 టీఎంసీలు, చిత్తూరు జిల్లాకు 1.676 టీఎంసీలను ఇప్పటి వరకూ విడుదల చేశారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీలు, గొల్లపల్లి రిజర్వాయర్‌లో 0.387 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గ్రామాల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో ఫేజ్ -1లో 14 చెరువులు, ఫేజ్–2లో 50 చెరువులను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు నింపారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం 4.943 టీఎంసీలను సాగునీటి అవసరాలకు కేటాయించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


ఉమాదేవి (ఫైల్)


రెండు ముక్కలైన కారు

పెనుకొండ రూరల్: డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన మురళి, ఉమాదేవి (34) దంపతులు బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. బెంగళూరులోనే స్థిరపడిన వీరు... తమ ఇద్దరు పిల్లలతో కలసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఆదివారం రాత్రి కారులో బెంగళూరుకు బయలుదేరారు. సోమవారం ఉదయం పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గుట్టూరు వై.జంక్షన్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొని రెండు ముక్కలైంది. ఘటనలో ఉమాదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పెనుకొండ ఎస్ఐ రంగడు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ సీఈఓ


వైపీ రమణారెడ్డి

అనంతపురం సిటీ: జెడ్పీ డిప్యూటీ సీఈఓగా వైపీ రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామాలో జిల్లా విజిలెన్స్ అధికారిగా పని చేస్తున్న రమణారెడ్డిని ఇన్‌చార్జ్ డిప్యూటీ సీఈఓగా డిప్యూటేషన్‌పై కలెక్టర్ గౌతమి నియమించిన సంగతి తెలిసిందే. ఉదయం సీఈఓ వైఖోమ్ నిదియాదేవిని, మధ్యాహ్నం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను విడివిడిగా ఆయన కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. బాధ్యతగా పని చేసి, జెడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు సూచించారు. అనంతరం జెడ్పీలోని అన్ని విభాగాల ఉద్యోగులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.

సెల్‌ఫోన్ చోరీ చేస్తూ...


స్థానికులకు పట్టుబడిన వ్యక్తి

అమరాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను అపహరించుకెళుతున్న దుండగుడిని స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. వివరాలు ఆరా తీయబోతే నోరు మెదపలేదు. దీంతో పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలోనూ తన పేరు, ఊరు సక్రమంగా చెప్పడం లేదని తెలిసింది. కాగా, అమరాపురంలో మూడు రోజుల క్రితం ఓ ఇంట్లో చోరీ జరిగింది. అలాగే ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న రమేష్‌కు చెందిన సెల్‌ఫోన్‌నూ అపహరించుకెళ్లారు. ఈ క్రమంలో ప్రస్తుతం పట్టుబడిన వ్యక్తికి ఆయా కేసుల్లో ఏదైనా ప్రమేయముందేమోనసే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

వైభవంగా ఎర్రిస్వామి తాత పరుష

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పోటాపోటీగా వృషభాల బల ప్రదర్శన


ఎర్రిస్వామి తాత మూలవిరాట్


ఉట్టి కొడుతున్న దృశ్యం

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో వెలసిన ఎర్రిస్వామి తాత పరుష మూడు రోజులుగా వైభవంగా సాగుతోంది. సోమవారం వేకువజామునే ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయ్యవారిపల్లి కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. ఉట్టి కొట్టేందుకు అయ్యవారిపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, కాట్నేకాలువ గ్రామాలకు చెందిన యువకులు పోటీ పడ్డారు. కాగా, ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్దే ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా అన్నదానం నిర్వహిస్తూ వచ్చారు. దీంతో గ్రామంలో ఏ ఇంట్లోనూ పొయ్యి వెలిగించలేదు. సోమవారం ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానందరెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా రాతి దూలం లాగుడు పోటీలు

ఎర్రిస్వామి తాత పరుష సందర్భంగా సోమవారం ఉదయం ఆలయం వద్ద జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 7 జతల దేశీయ వృషభాలను రైతులు తీసుకువచ్చారు. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించగా... బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు గురుయాదవ్ వృషభాలు ప్రథమ బహుమతి దక్కించుకున్నాయి. అలాగే ఆత్మకూరు మండలం కుర్లపల్లి గ్రామ రైతు వెంకమ్మ వృషభాలు ద్వితీయ స్థానం, బళ్లారికి చెందిన ఆనందరెడ్డి వృషభాలు తృతీయ స్థానం, రాయదుర్గం మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన రైతు వీరేష్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేత వృషభాల యజమానులను నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న మహానగర సంకీర్తన


మహానగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకరరాజు


బోనాలతో వెళుతున్న మహిళలు

పుట్టపర్తి అర్బన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడింది. ఆదిలాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం మహానగర సంకీర్తన చేపట్టారు. దాదాపు 2,500 మంది భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని సత్తెమ్మ సర్కిల్ వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు ప్రారంభించారు. మహిళా భక్తులు జ్యోతులు, బోనాలు ఎత్తుకుని బతుకమ్మ ఆడుతూ ముందుకు సాగారు. యువత, చిన్నారులు రంగురంగుల జెండాల ప్రదర్శనతో భజనలు, కోలాటం, చెక్కభజన ఆడుతూ అనుసరించారు. సత్తెమ్మ ఆలయం నుంచి ఎస్‌బీఐ రోడ్డు, గోపురం, గణేష్ గేట్ మీదుగా విద్యాగిరి వరకూ నగర సంకీర్తన కొనసాగింది. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.